73

# ప్రేమ

ప్రేమని నేను ప్రేమించిన సంగతి ప్రేమకి తెలుసో తెలీదో నాకు తెలుసు. ఆ సంగతి తరువాత చెబుతాను. నేను మాత్రం ప్రేమని చాలా గాఢంగా, దేశాన్ని దరిద్రం ప్రేమించినట్టు, (సిమిలీ బావులేదని తెలుసు. అందుకే ప్రేమ కవిత్వాన్ని నేర్పుతుందన్న విషయం నేనింకా నమ్మ లేదు.) జనరలెలక్షన్ రోజుల్లో మనని అభ్యర్థులు ప్రేమించినంతగా గాఢంగా ప్రేమించేను.

అసలు ప్రేమతో పరిచయం చాలా ప్రేమెటిక్‌గా జరిగింది.ఓరోజు పెందరాళే లేచి, వాచీలో ఎనిమిది చూసి బెడ్‌కాఫీ తాగుదామనుకొని మానేసి నవ్వుకొని, 'నా చిగుళ్ళ ఆరోగ్యము కొరకై నేనెల్లప్పుడూ వాడే బినాకా టూత్‌పేస్టుని బ్రష్ పైనుంచి, కిటికీలోంచి ఎందుకోగాని చూసేను. అలా చూసి చాలా అబ్బురపడి, ఆశ్చర్యపోయేన్నేను. ఎందు వల్లంటే, ఎదురింటి కిటికీలో మెరిసిన ఎర్రటి టెర్లిన్ పైట, ఆ పైన తెల్లని నాజూకైన చేయి, అంతేకాక ఆ పైట, చెయ్యిగల ఆసామీ కిటికీ పక్కనించి బహు నాజూకుగా నడచి వెళ్ళడం, చూసి నా అబ్బురం ఆశ్చర్యం పూర్తయేలోపుని, ఆ ఎర్రపైట, తెల్ల చెయ్యిగల అమ్మాయి మొహం కూడా నాకు కిటికీ లోంచి కనిపించేయి. అది మాత్రమే కాక ఆమె కళ్ళు రెండూ నా పక్క పరీక్షగా 'ప్రేమిష్'గా చూడడంతో నా అబ్బురం ఆశ్చర్యం అవధుల్లేకుండా అదిరి పెరిగేయి. "తొలిప్రేమలో

ఇంత బలమున్నదా...." అని సోలో పాడుదామనుకున్నాను. కాని కవిత్వం పూర్తిగా రాకా, నోట్లో బ్రష్ వుండడం వల్లా పాడలేకపోయాను. ఆ విధంగా నేను ప్రేమని తెలియకముందే ప్రేమకు నన్ను తెలియకముందే ప్రేమించడం ప్రారంభించేను.

"ఆ తరువాత నాకు ప్రేమతో పరిచయం ఐంది. ఎలా ఐందంటే మామూలుగా హీరో హీరోయిన్లకి ఎలా అవుతుందో అలాగే! ఎదురిల్లు అంటే నా రూమ్‌కి ఎదురుగానే వాళ్ళ ఇల్లన్నమాట. ఫైన లియర్లో ఆ రూమ్‌కి కొత్తగా మారినందుకు (లేక ఆ కొత్త రూమ్‌కి మారినందుకు) చాలా సంతోషించేను నేను....ఇంతకీ ప్రేమ 'ఉమన్స్ కాన్వెంట్' లో నాలాగే బి. యస్సీ ఫైనలియర్ చదువుతోంది. (నాలాగే 'కాన్వెంట్' లో కాదు బాబోయ్! నాలాగే బి. యస్సీ) ఆమె అతి మోడర్న్‌గా వుంటుంది. తెల్లగా పొడవుగా వుంటుంది. సన్నగా వుంటుంది. నాజూగ్గా వుంటుంది. అందంగా వుంటుంది. ఎప్పుడూ చేతికి స్క్వేర్ వాచీ కలిగియుంటుంది. అతిథుల్తో మర్యాదగా వుంటుంది. నాలాటి ఫ్రెండ్స్‌తో సోషల్‌గా వుంటుంది....ఆ విధంగా ఆమె అన్నివిధాలా 'డిజైరబుల్' గా వుంటూ నోకాల్డు మోడర్న్ సివిలిజేషన్‌ని ఉదాహరణంగా నిరూపించేటట్టు వుంటుంది.

రానురాను ప్రేమ నా ప్రేమని గ్రహిస్తుందని నేను తెలుసుకున్నాను. తెలుసుకొని సంతోషించేను. కాని అప్పుడప్పుడు ముఖ్యంగా ఈ మధ్య ప్రేమ వైఖరి అదోలా వుంది. అదినాకు చాలా చిరాకుని కలిగించింది. ఓరోజు వాళ్ళింట్లో బాల్కనీలో కూర్చొని మాట్లాడుతున్నాం. ఒక్కసారిగా ప్రేమ "కిషన్! నీకీ క్రిష్టారావనే పేరెవరు పెట్టేరు?" అంది.

"జ్ఞాపకం లేదుకాని మా అమ్మా నాన్నా పెట్టి వుంటారు." అన్నాను. "ప్చ! వాట్స్ దట్ నేమ్? కిషన్ అనో కిషోర్‌కుమార్ అనో మార్చుకో కూడదూ?" అంది. నేను నవ్వేసి వూరుకున్నాను. నవ్వేసేనే కాని నాకు కొంచెం చిరాకు కలిగింది.

ఇంతలోనే ప్రేమ టాపిక్ మార్చి "నువ్వు సిగరెట్లు కాల్చవా ?" అంది.

"కాల్చను." అన్నాన్నేను.

"షేమాన్ మైపార్ట్" అంది. అని వాళ్ళ బోయ్‌ని పిల్చి గోల్డ్ ఫ్లేక్ పేకెట్టు తెప్పించింది. నేను సిగరెట్టు వెలిగించేక

"ఉ। వాట్ మోర్ న్యూస్ బోయ్'" అంది.

"ఏముంది ? పాపం బీహారులో చూసేవా ? ఎంత కరువు ? ఎన్ని కష్టాలు....అక్కడి ప్రజల...." అని నేను పూర్తి చేయకుండానే.

"డేమిట్ ! దరిద్రం తప్ప మరో టాపిక్కు డిన్ట్‌యు ఫైండ్ ? దొరకలేదూ నీకు ?!" అంది. కాస్సేపాగి "ఎల్విస్‌వి కొత్త రికార్డు లొచ్చేయి తెలుసా ?" అంది.

నేను అవి ఏ బాటనీవో, కెమిస్ట్రీవో రికార్డు లనుకున్నాను. అనుకుని "ఇంకా వున్నవి చాలవేమిటి ?"అని విసుక్కున్నాను.

అప్పుడు ప్రేమ నన్ను డిసెక్ట్ చేసి పారేసిన బొద్దింకను చూసినట్టు చూసి, "వాట్ ? ఎల్విస్ పాటలు బోరా ?" అంది. అప్పుడు నాక్కొంచెం అర్థమైంది. అర్థమయేక "పాటలా !" అని "రిలాక్స్" అయేను. అయేక పాత సిగరెట్టు పారేసి కొత్త సిగరెట్టు వెలిగించేను.

* * * *

మరో రోజులు, మరికొన్నిలా గడిచేక ప్రేమ చాలా మోడర్న్ పైపనీ, నేను ఆమె ముందు మోడర్న్ నాలెడ్జితో ట్యూబులైటు ముందు జీరోకాండిల్ బల్బులాంటి వాణ్ణనీ తెలిసింది నాకు. తెలిసేక నేనుకొంచెం సిగ్గుపడినా ఆ తర్వాత మానేసి ప్రేమ దగ్గిర కొత్త విషయాలు చాలా నేర్చుకోవటం ప్రారంభించేను.

ఓరోజు సాయంత్రం కలియగానే ప్రేమ "ఫోర్ ఫార్టీనైన్ ! ఫోర్ ఫార్టీనైన్ !" అని సంతోషంగానూ గాభరాగానూ అంది.

నేను కంగారుపడి, "ఏమిటి ? నీబ్లడ్ ప్రెషరా ?" అనడిగేను.

అప్పుడు ప్రేమ చాలా కోప్పడి, నా అజ్ఞానానికి అమితంగా విచారించి చెప్పింది. "క్రికెట్ స్కోర్", అని చెప్పి. "సాబర్స్ సెంచరీ" అని కలిపింది.

నేను సెంచరీ అంటే ఏమిటో అర్థం చేసికొని, అన్నీ తెలిసిన వాడిలాగ, "నిజమే! సాబర్స్ లేందే మన దేశపు క్రికెట్ టీమేలేదు. అన్నాను వుద్రేకంగా. అప్పుడు ప్రేమ ఏమీ మాట్లాడకుండా కళ్ళ లోంచి కోపాన్ని కురిపించి గబగబా ఎందుకు వెళ్ళిపోయిందో అర్థం కాలేదు నాకు.

ఆ తరువాత నేను ప్రేమించిన మిత్రుడు, మేలురకపు క్రికెట్ ఆటగాడూ ఐన 'జగన్' ని కలిసి ఈ ఫార్సంతా చెప్పేను. అతను కోప్పడలేదు కాని విపరీతంగా నవ్వేడు. అతను నవ్వడం ఐపోయేక, నేను అతనికి అద్భుతమైన ఐస్ క్రీం యిప్పించి, క్రికెట్ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. అంతేకాక, మిగలిన స్పోర్ట్స్ గురించి కూడా 'డీప్' గా తెలుసుకుని, రోజూ పేపర్లో ఆఖరి పేజీ చదవ నారంభించేను. అన్నిరకాల ఆటల గురించి యింత 'డీప్' గా స్టడీ చేయడం వల్ల నేను కన్ఫ్యూజ్ అయేను. ఓరోజు.... ప్రేమని కలియుగానే నేను త్రాతంగా "ప్రేం! మిల్కాసింగ్ ఎనిమిది వికెట్లు విన్నావా?" అన్నాను. అనిఆమె ప్రేమని దాదాపు సంపాదించినంత సంతోషిస్తుండగా, ప్రేమ విసుగ్గా నా వైపు చూసి "యు ఆర్ మేడ్. నీకు పిచ్చెక్కింది." అని క్రికెట్‌కీ మిల్కాసింగ్‌కీ సంబంధంలేదని చెప్పింది. చెప్పి కళ్ళలోంచి నిప్పులు కక్కింది. నేను సిగరెట్టు తీసి వెలిగించేను. నేను ప్రేమ గురించింత కష్టపడుతున్నా ప్రేమ నాకు దూరమైపోతోందేమోననిపించి, నేను చాలా గాభరా పడ్డాను.

యింతలోనే "నీ పేంటు వెడల్పెంత?" అంది. నేను "పదహా రించీలు" అన్నాను.

"నోనో! దట్స్‌నాటిట్. మేకిట్ ట్వల్వ్" అంది ప్రేమ. "అలాగే" అన్నాను. ఆ తరువాత అంతకు ముందు నేర్చుకున్న "డీన్" పాటల గురించీ మిస్ యూనివర్స్ పోటీల గురించీ, బినాకా గీత్‌మాలా గురించీ అనర్గళంగా మాట్లాడేన్నేను. మాట్లాడి నా నాలెడ్జికీ అప్పుడు ప్రేమ కళ్ళలో వెలిగిన వెలుగుల గురించీ చాలా సంతోషించేన్నేను. అప్పుడు

ప్రేమ నాతో చాలా ప్రేమగా మాట్లాడింది. "రేపు సుసాన్ హేవర్డ్ పిక్చరుంది. వెళదామా ?" అంది.

"వెళదాం. తప్పక వెళదాం. అతనే నా అభిమాన హీరో ఆ మధ్య ఒక సినిమాలో ఆయన చేసిన స్టంటు నేను లైఫ్‌లో మర్చిపోను ప్రేం! లైఫ్‌లో మర్చిపోను." అన్నాన్నేను.

అప్పుడు ప్రేమ మళ్ళీ నన్నుకోప్పడి 'సుసాన్' హీరోకాదనీ హీరోయిన్ననీ చెప్పింది. "యింకా నీ నాలెడ్జి చాలదు! కిషన్! యూహేవ్ టుగ్రో స్టిల్." అని కూడా అంది.

నేను కొంచెం విచారించి టైలర్ దగ్గరకి కదిలేను.

* * * *

ఇలా కొన్నిరోజులు గడిచేక నాకు మా వూరి నించి వుత్తరం వచ్చింది. అందులో మానాన్నగారు ఆఖరి పేరాలో ఇలా రాసేరు.

"ఈ నెలలో నువ్విప్పటికి ఖర్చు పెట్టింది మూడొందల ఇరవై నాలుగు రూపాయలు. మళ్ళీ నేను పంపేలోపున డబ్బు పంపమని రాస్తే మనియార్డర్ రాదు. నేనే వస్తాను. మీ తాతగారి చేతికర్ర నీకు గుర్తుండే వుంటుంది."

వుత్తరం చదివి నేను కొంచెం భయపడి, ఎక్కువ గాభరా పడ్డాను. కాని ప్రేమించడంలో త్యాగాలు చాలా చేయవలసి వుంటుందని ఆ మధ్య శర్మ చెప్పేడు. నా దగ్గర తొమ్మిది సిగరెట్లు గల గోల్డ్‌ఫ్లేక్ పేకెట్టు తీసికొంటూ. అందువల్ల నేను ఆ డైలాగ్‌ని తల్చుకొని ధైర్యాన్ని తెచ్చుకున్నాను.

* * * *

"ప్రేమించడం ఒక కళ. ప్రేమికుడు గొప్ప కళాకారుడు." అని కూడా ఆ మధ్య శర్మే చెప్పేడు. నేను ప్రేమిస్తూ కూడా ప్రేమకి ఆ విషయం తెలియజేయకుండా వొత్తి 'కలాకారుడు' గా వుండి పోవడం నాకు ఇష్టం లేకపోయింది. అందువల్ల వొకరోజు ధైర్యం చేసి ప్రేమా వాళ్ళింటి బాల్కనీ మీద సోఫాలో కూర్చుని

"ప్రేం! నీ కోసం నేను ఎన్నిత్యాగాలు చేసేనో నీకు తెలుసు. మా నాన్నగారు చూస్తే ఇంట్లోంచి తగలిస్తారని తెలిసికూడా డబ్బు ఎలా ఖర్చు పెట్టేనో తెల్సు. పెంట్లాలు ఎంత ఇరుగ్గా కుట్టిస్తున్నానో ఆ పేంట్లని వాడడంలో ఎంత టైమ్ ఖర్చు పెడుతున్నానో తెలుసు. ఎల్విస్, డీన్ క్లిఫ్ రిచర్డ్ డోరిస్‌డే....వీళ్ళందరి పాటలూ సోబర్స్, హాల్స్, హంట్....వీళ్ళందరి రికార్డులూ జీవిత చరిత్రలూ ఎంత కష్టపడి కంఠతా పెట్టేనో నీకు తెలుసు. ఇంకా మరెన్నెన్ని త్యాగాలు చేసేనో నీకు తెలుసు....ప్రేం। అందుకే ఇన్ని త్యాగాలూ చేసేను. నా పెంట్లాలు చూసి, అందరూ కళ్ళు జబ్బంటున్నా, నా వ్యవహారం చూసి జెలసీ చెందుతున్నా, మా నాన్నగారు మొన్న మనం చూసిన సినిమాలో హీరో యిన్నాన్నలాగ కోపంగా బెదిరిస్తూ ఉత్తరాలు రాస్తున్నా....నేను మారలేదు. ఇదంతా నీ కోసం ప్రేం। నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమించేను. ప్రేమిస్తున్నాను...." అని ప్రేమతో అన్నాను. అని కళ్ళు మూసుక్కుని సోఫాలో చేరబడ్డాను.

ప్రేమ లేచి నిలబడిన శబ్దం అయింది. మరి కాస్సేపటికి రికార్డ్ ప్లేయర్ చేసిన శబ్దం అయింది. ఏదో ఇంగ్లీషు పాట కంగారుగా కడుపులో తిప్పిన వాడు పాడినట్లుగా వినిపించ నారంభించింది. ఆ తరువాత ప్రేమ గొంతుక వినిపించింది. "కిషన్। నువ్వెన్ని త్యాగాలు చేసేవో ననుకున్నావా? ఇవన్నీ త్యాగాలా? యు ఆర్ ఎ ఫూల్। మోడర్న్ సొసైటీలో బతకడానికి, ప్రిలిమినరీ రైట్స్, ప్రథమ హక్కులు.... ఐనా ప్రేమిస్తున్నానంటున్నావు కనక, నాడెసిషన్ త్వరలోనే చెప్తాను" అంది ప్రేమ.

నేను ఆలోచిస్తూ లేచి వచ్చేసేను.

ఆ మర్నాడు నే వెళ్ళేసరికి చెవి దగ్గర ట్రాన్సిస్టర్ పెట్టుకుని, ప్రేమ కూర్చునివుంది. మాట్లాడ వద్దని నాకు సంజ్ఞ చేసింది. "ట్రాన్సిస్టర్ సౌండు ఎక్కువ పెట్టుకోవచ్చుకదా? చెవి దగ్గరెందుకు ప్రేం? బ్రహ్మ చెముడు వాళ్ళలాగ ?" అని నేను ఆమె సంజ్ఞని పట్టించుకోకుండా జోకు

వేసేను. ఆ జోకుకి ప్రేమకి చాలా కోపం వచ్చిందని! ఆమె కళ్ళద్వారా నేనుపసిగట్టేను.ఆమె గభాలున ట్రాన్సిష్టర్ కిందపెట్టి, "కామెంటరీ వింటున్నాను. నీ జోకు నా మొహంలా వుంది" అని గభాలున మళ్ళీ ట్రాన్సిస్టర్ చెవి దగ్గర పెట్టుకుంది. "అంత బావుందా?" అందామనుకుని, మరీ పాత జోకని మానీసేను.

ఆ తరవాత ఎంత సేపటికీ ట్రాన్సిస్టర్ని ఆమె దించకపోవడంతో నేను చదువుకుందామని వచ్చేసేను.

* * * *

ఆ తరవాత నేను చదువు గొడవల్లోపడి వారం రోజులు ప్రేమని కలియలేదు. ఎనిమిదోరోజున నాకు లోకల్గా ఒక కవరొచ్చింది. తీస్తే అందులోంచి తెల్లని కాగితం వచ్చింది. ఆ కాగితం తీసి చదివేన్నేను.

కిషన్,

నువు చేసినవి త్యాగాలుకావని చెప్పేను. గుర్తుందా! నువు నన్ను ప్రేమిస్తున్నావని నా కిదివరకే తెలుసు. కాని నేను ప్రేమించడానికి నీ నాలెడ్జి చాలదు కిషన్. నువు నేర్చుకున్నవన్నీ మనిషికి తెలియడం అవసరం. అందువల్ల నేను నిన్ను మాడర్నైయిజు చేయగలిగేనేకాని, ప్రేమించలేక పోయేను. నువు, నేననుకున్న స్టాండర్డ్కి ఎదగలేదు. అందుచేత నేను నిన్ను ప్రేమించి, ఫ్యూచర్ని తెలుగు సినిమా పాటలాగ చేసికోలేను. అంతే సంగతి.

ప్రేమ.

అని వుందా కాగితంలో.

నేనది చదివి 'షాక్' తిన్నాను. మంచి నీళ్ళు తాగి, బట్టలు వేసుకొని గబగబా జగన్ దగ్గిరికి పరిగెత్తేను. అతన్ని కలిసి,

"నా కిష్టం లేకపోయినా, నే నెన్ని త్యాగాలు చేసేనో విన్నావా? లేకపోతే, ఏమీ తెలియని ఇంగ్లీషు పాటలు, ఆ క్రికెట్టు, ఈగొట్టాం

పేంట్లు, ఇవన్నీ నాకెందుకు చెప్పు. అసలివన్నీ నాకెంత బోరో నీకు తెలుసుకదా?" అని అతనితో అన్నాను.

జగన్ సిగరెట్టు వెలిగించి, పొగతో నవ్వి, "ప్రేమ క్రికెట్టు ఆటలాంటిది నాయనా. నువ్వెన్ని త్యాగపు సెంచరీలు కొట్టినా, ఒక్క వికెట్టుతో నువ్వు అవుటవక తప్పదు. ఆ టెస్టు సరి....ఇదే ప్రేమలో ఫిలాసఫీ" అన్నాడు.

నేను తల పట్టుకుని, ఆ తరవాత జగన్ చెయ్యి పట్టుకొని హోటల్ వేపు నడిచేను.